# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సాఫీగా జరుగుతోంది. పల్నాడు జిల్లా యల్లమంద గ్రామంలో ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు స్వయంగా పింఛన్లు అందజేశారు.

2. అంతరిక్ష రంగంలో ఉపగ్రహాలను అనుసంధానం చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని మన దేశం సొంతం చేసుకుంటోందని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ తెలిపారు.

3. పి.ఎస్.ఎల్. వి. –సి 60 ప్రయోగ విజయంతో భారత దేశ అంతరిక్ష సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందని ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అన్నారు.

4. రాష్ట్రంలో నిర్మాణం పూర్తయిన లక్ష గృహాలను లబ్ధిదారులకు త్వరలో అందజేస్తామని గృహ నిర్మాణ ...., సమాచార శాఖమంత్రి కె. పార్థ సారథి తెలిపారు.

5. రాష్ట్ర వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసు శాఖ సూచించింది.

==========================

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఈ రోజు సాఫీగా జరుగుతోంది. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం యల్లమంద గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేయగా ...., మిగిలిన ప్రాంతాలలో మంత్రులు ...., శాసన సభ్యులు పింఛన్ల అందజేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల 77 వేల 943 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం 2 వేల 7 వందల 17 కోట్ల రూపాయల మొత్తాన్ని విడుదల చేసింది. ఉదయం పది గంటల వరకు 83.45 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

మరొక వైపు ...పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. జియో ట్యాగింగ్ ద్వారా పంపిణీ జరుగుతోందా ... లేదా అన్న విషయం పరిశీలిస్తోంది.

---------------------------

నెల్లూరు నగర పరిధిలోని గుర్రాల మడుగు ప్రాంతంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ లబ్ధిదారులకు

పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .... కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటవ తేదీన పెన్షన్లు అందజేస్తున్నామని చెప్పారు. ఒకటవ తేదీన పండుగలు ..., సెలవు ఉన్న పక్షంలో ఒక రోజు ముందు గానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొంటూ .........

..వాయిస్.... 22 సెకన్లు....

తిరుపతి నగరంలోని బొమ్మగుంట ప్రాంతంలో స్థానిక శాసన సభ్యుడు ఆరణి శ్రీనివాసులు లబ్దిదారులకు పింఛన్లు అందజేశారు.

---------------------------

గత రాత్రి విజయవంతమైన పిఎస్ఎల్వి–సి 60 రాకెట్ ప్రయోగంతో అంతరిక్షంలో ఉపగ్రహాలను అనుసంధానం చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని మన దేశం సొంతం చేసుకుంటోందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ సోమనాథ్ తెలిపారు.

పిఎస్ఎల్వి–సి60 ప్రయోగం విజయవంతమైన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ... ... బహుళ రాకెట్ ప్రయోగాలు అవసరమైనపుడు అంతరిక్షంలో అనుసంధాన సాంకేతిక ప్రక్రియ ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం ఇప్పటి వరకూ అమెరికా ....., రష్యా ..., చైనా దేశాలకు మాత్రమే ఉందని ..., చంద్రయాన్ - 4 ..., భారత అంతరిక్ష కేంద్రం నిర్మాణం ..., ఇతర అంతరిక్ష ఆశయాలు సాధించాలంటే అనుసంధాన ప్రక్రియను సొంతం చేసుకోవడం అవసరమని అన్నారు. ప్రస్తుతం ఇరవై కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ ఉపగ్రహాలను వారం రోజుల వ్యవధిలో జనవరి 7వ తేదీ నాటికి దగ్గరకు తీసుకు వస్తామని సోమనాథ్ వివరించారు.

---------------------------

అంతరిక్ష ప్రయోగాలలో మరింత పురోగతి సాధించేలా పి.ఎస్.ఎల్.వి. –సి 60 రాకెట్ ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ... ఇస్రో ... విజయవంతంగా ప్రయోగించడం పట్ల ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో అంతరిక్షంలో ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియలో ఇస్రో సాధించిన సామర్థ్యం .... ప్రపంచానికి తేటతెల్లమైందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో ఇస్రో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి ఈ ప్రయోగ విజయం వీలు కల్పించిందని చంద్ర బాబు నాయుడు అన్నారు.

---------------------------

పుస్తక ప్రియులను అలరించే 35 వ పుస్తక మహోత్సవం జనవరి రెండవ తేదీన విజయవాడలో ప్రారంభమవుతుంది. నగరంలోని ఇందిరాగాంధీ మైదానంలో జనవరి 12 వ తేదీ వరకు జరిగే ఈ పుస్తక మహోత్సవంలో రెండు వందలకు పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. రెండవ తేదీ సాయంత్రం ఉప ముఖ్య మంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రారంభించే ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ..., కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు పాల్గొంటారు. ఈ సందర్భంగా "పి. వి. నరసింహారావు సాహిత్య జీవన చిత్రం" పుస్తకాన్ని పవన్ కళ్యాణ్ ఆవిష్కరిస్తారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి "రామోజీరావు సాహిత్య వేదిక" అని నామకరణం చేశారు.

పుస్తక మహోత్సవంలో భాగంగా పుస్తక ప్రదర్శనలు ..., సాహిత్య చర్చలు ..., ప్రజలను అలరించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పుస్తక మహోత్సవ నిర్వాహకులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిందని గృహ నిర్మాణ ..., సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.

గృహ నిర్మాణ కార్యక్రమంపై వెలగపూడి సచివాలయంలో నిన్న ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .... వచ్చే మార్చి నాటికి మరొక 50 వేల ఇళ్లను నిర్మించాలని అధికారులు లక్ష్యం నిర్దేశించుకోవాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్ళను లబ్దిదారులకు త్వరలోనే అందజేస్తామని..., ఇళ్లను అప్పగించే ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ఈరోజు రాత్రి నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసు శాఖ సూచించింది. ప్రజల భద్రత దృష్ట్యా వేడుకలపై పోలీసు శాఖ పలు ఆంక్షలు విధించింది. బహిరంగ ప్రదేశాలలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదని స్పష్టం చేసింది. కీలక ప్రాంతాలలో పోలీసు నిఘా ఉంటుందని, శాంతి భద్రతలు కాపాడే విషయంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. పబ్‌లు, క్లబ్‌లు తదితర ప్రదేశాలలో నిర్దేశించిన సమయానికి మించి వేడుకలు జరపరాదని .., ఈ ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసు శాఖ హెచ్చరించింది.

నూతన సంవత్సర వేడుకలపై విధించిన ఆంక్షలపై విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు వివరిస్తూ ....

..వాయిస్ ..25 సెకన్లు

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం తెలంగాణా ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతిస్తూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి స్పందిస్తూ .... తిరుమలేశుని దర్శనం విషయంలో తెలంగాణా ప్రజా ప్రతినిధులకు సానుకూలంగా స్పందించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రతి గ్రామానికి తాగు నీరు అందించాలన్న లక్ష్యం సాధించే దిశగా తెలుగు దేశం ..., జన సేన ...., భారతీయ జనతా పార్టీల కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో నిన్న ఆయన పాత్రికేయులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ .... దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామానికి తాగు నీరు ఇవ్వాలన్నది ప్రధానమంత్రి నరేంద్రమోడీ కల అని అన్నారు. వాతావరణ

కాలుష్యాన్ని నివారించేందుకు పర్యావరణ పరిరక్షణ ...., పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సేవలు అందించే విషయంలో కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతంగా పని చేస్తోందని ..., ప్రభుత్వోద్యోగులు కూడా ప్రజల కోసం పని చేయాలని సూచించారు. ప్రజలలోకి వెళ్లి క్షేత్ర స్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు ..., తెగల ప్రజలపై జరుగుతున్న అత్యాచార కేసులను సత్వరమే పరిష్కరించాలని సూక్ష్మ ..., చిన్న ..., మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. విజయనగరం పట్టణంలో నిన్న జరిగిన జిల్లా స్థాయి నిఘా విభాగం ..., పరిశీలనా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ .... షెడ్యూల్డ్ కులాలు ..., తెగల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ..., ఈ వర్గాల రక్షణ కోసం రూపొందించిన చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని మంత్రి శ్రీనివాస్ సూచించారు.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నెల 7 నుంచి మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే ఈ వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది.

=======================